# మన'వే'మన పద్యాలు

ఆ. వె. పుట్టిన జనులెల్ల భూమిలో నుండిన
బట్టునా జగంబు పట్ట దెపుడు
యముని లెక్కరీతి నరుగుచు నుందురు
విశ్వదాభిరామ వినురవేమ!

**అర్థములు** : లెక్కరీతి = గణించినవిధముగా
అరుగుచు = వెళ్ళిపోతూ

**తాత్పర్యము** : ఈ భూమిపై పుట్టిన ప్రతిజీవి గిట్టక తప్పదు. ఈ నిజము తెలిసినను, ప్రతి ఒక్కరూ తాము శాశ్వతముగా ఇక్కడ ఉంటామన్నట్లు, మాయ ప్రభావముచేత ప్రవర్తిస్తుంటారు. పుట్టిన ప్రతి జీవి యముని లెక్కను అనుసరించి తనువును విడచుట తథ్యము. అటులకానిచో ఈ భూతలముపై జీవులు చలించుటకు కావలసిన ప్రదేశముకూడా మిగలదు. కాలచక్రములో పుట్టుక ఎంతనిజమో తనువు వీడుటకూడా అంతే నిజము. ఈ విషయమును గ్రహించినవాడు జ్ఞానసంపన్నుడు - ఈ అతి తక్కువ సమయమును సద్వినియోగము చేసుకునే ప్రయత్నం చేస్తాడు. ఆటవెలది పద్యములో ఈ చక్కని నీతిని ఇమిడ్చిన వేమన ధన్యుడు.

ఆ. వె. అరయ నాస్తి యనక యడ్డు మాటాడక
తట్టు పడక మదిని దన్నుకోక
తనది గాదనుకొని తాబెట్టునది పెట్టు
విశ్వదాభిరామ వినురవేమ!

**అర్థములు** : ఆస్తి = సంపద
అడ్డు మాటాడక = లేదనకుండా
తట్టు పడక = తొందర పడకుండా
మదిని దన్నుకోక = మనస్సులో తర్జన భర్జన పడకుండా
పెట్టు = ఫలమిచ్చునది.

**తాత్పర్యము**: లేదనకుండా, తొందర పడకుండా, తొట్రుపాటు లేకుండా, మనసులో ఇచ్చుచున్నాననే ఆలోచన లేకుండా చేయు దానమే ఉత్తమమైనది. మన పెద్దలు చెప్పినట్లు కుడిచేతితో చేసేదానము ఎడమ చేతికికూడా తెలియకూడదన్నట్లుండాలి. అనగా, దానము చేసిన మరు నిమిషములో దానిని గురించి మరచిపోవాలి. అలా చేసినపుడు దాని ఫలము మనకు సంపూర్ణముగా లభిస్తుంది. నిష్కామ కర్మ గురించి ప్రస్తావిస్తూ, "కార్యాచరణపై మాత్రమే మనకు ఆసక్తి ఉండాలి. ఫలితముపై కాదు." అని శ్రీకృష్ణుడు (భగవద్గీత ద్వారా) తెలియజేసెను కదా!

*(ఇందులో కొంత భాగము స్వామి చిదాత్మానందగారి 'వేమన పద్యములు - అంతరార్థము' ప్రవచనములలో ఒంట పట్టించుకున్న సారాంశము. పూజ్య శ్రీ స్వామి చిదాత్మానంద గారికి ధన్యవాదములతో...)*